మీకోసం

వెల్లుల్లిని కాగితపు సంచిలో వేసి ఉంచితే అవి చెడిపోకుండా ఎక్కువ కాలం నిల్వ ఉంటాయి.

జీవన సౌరభం

నవ్వడం, నవ్వించడం అలవాటైతే జీవితంలోని ఒడుదుడుకులు ఏమీ చెయ్యలేవు.

ఉడుత - కుందేలు



గట్టునున్న చెట్టు మీద
ఉడుత ఒకటి కూర్చొంది
చెట్టునున్న జామపండు
ప్రీతితోడ తింటోంది

అది చూసిన కుందేలు
పండునొకటి ఇవ్వమంది
పళ్ళన్నీ తనవేనని
ఉడతమ్మ ఇవ్వనంది

అంతలోనే చిలుక గుంపు
చెట్టు పైన వాలింది
పళ్ళన్నీ ఆరగించి
హాయిగాను ఎగిరింది

చెట్టునున్న ఆ ఉడుత
చేష్టలుడిగి చూసింది
కుందేలును చూసి అది
సిగ్గుపడీ నొచ్చుకుంది

అప్పుడు ఆ కుందేలు
'బాధపడకు ఉడుతమ్మా!
అందరికీ అడవిపై
హక్కుంది' చెప్పింది.

కలిసి మెలిసి అందరము
పంచుకుంటే ఆనందము
పంచుకోవటంలోనే
మనకు కలదు సంతోషం!

- రావిపల్లి వాసుదేవరావు
94417 13136

దారి చూపండి

చిన్నారులూ, బయటకు వెళ్లిన పిల్ల ఏనుగు దారి తప్పిపోయింది. మరి దానికి దారి చూపి తల్లి ఏనుగు దగ్గరకు చేర్చండి.

బొమ్మ గీయండి!

చిన్నారులూ , ఈ రోజు చిన్న కుక్కపిల్ల బొమ్మ గీయడం నేర్చుకుందాం. ఈ బొమ్మలో ఇచ్చిన అంకెల ఆధారంగా బొమ్మ గీయండి.



నేను గీసిన బొమ్మ

- జి.స్ఫూర్తి
బందరు రోడ్డు,
విజయవాడ.

రయ్ రయ్‌న సాగుతూ ... ఓ జంట సాహస యాత్ర

ప్రకృతిని, ప్రయాణాన్ని ఆస్వాదించాలనే వారి బలమైన ఆకాంక్ష ముందు వేల కిలోమీటర్ల దూరం చాలా చిన్నదైపోయింది. అనేక ఇబ్బందులను, వాతావరణం ప్రతికూలతలనూ తట్టుకుంటూ వారు ఆ జంట బైకుపై సుదూర ప్రయాణం చేసింది. వారి ప్రయాణం.. ప్రకృతి అందాలను, వివిధ రాష్ట్రాల్లోని సాంప్రదాయాలను తెలుసుకునేందుకు అవకాశం కల్పించింది. ఎన్నో మధురానుభూతులను అందించింది. చిత్తూరు జిల్లా పెద్ద పంజాణి మండలం మారుమూల గ్రామం అప్పినపల్లి నుంచి అత్యంత ఎత్తయిన ప్రాంతం లద్దాక్‌కు వారి ప్రయాణం సాగింది. 11 వేల ఐదొందల కిలోమీటర్ల దూరాన్ని 37 రోజుల పాటు దిగ్విజయంగా సాగించి మన రాష్ట్రంలో కపుల్ రైడింగ్ నిర్వహించిన మొదటి జంటగా వారు పేరు తెచ్చుకున్నారు.

రంపాల రమేష్ ప్రయివేటు డెయిరీలో ఐటి సలహాదారుగా పనిచేస్తున్నాడు. ఆయన భార్య తులసీకుమారి గృహిణి. వీరికి ఇద్దరు పిల్లలు. రమేష్‌కు బైకుపై లాంగ్ డ్రైవ్ చేయడం అంటే చాలా ఇష్టం. ఉద్యోగ రీత్యా చెన్నై, మధురై, చిత్తూరు బ్రాంచులకు తరచూ వెళ్లాల్సివుంటుంది. ఈ ప్రయాణాలకు బైకునే వాడతాడు. ఎంత దూరమైనా బైకుపైనే ప్రయాణం చేస్తాడు తప్ప ఇతర రవాణా సౌకర్యాలను ఇష్టపడడు. తాను బస్సెక్కక కొన్ని సంవత్సరాలవుతుందంటున్నాడు రమేష్.

బైక్ రైడింగ్‌పై తరచూ యూట్యూబ్ ఛానెళ్లలోని వీడియోలు చూస్తుండేవాడు. అలా రాష్ట్రం నుంచి బైక్ రైడింగ్ చేసే ఇరవై మందిని యూట్యూబ్‌లో పరిశీలించి, వారి ద్వారా ప్రేరణ పొందిన రమేష్ ప్రకృతి అందాలను తిలకించాలనే ఆశతో ప్రయాణాలు మొదలు పెట్టాడు. తనతో పాటు భార్యనూ తీసుకెళ్లేవాడు. ఇద్దరూ కలిసి ఎన్నో సుదూర ప్రయాణాలు చేశారు. గతేడాది సెప్టెంబర్‌లో హైదరాబాద్‌కు వెళ్లిరావడానికి బైకుపై మూడు రోజులపాటు ప్రయాణం సాగించారు. అక్టోబర్‌లో ధర్మస్థలానికి వెళ్లారు. ఆ తర్వాత లద్దాక్ వెళ్లాలనే ఆలోచన చేశాడు రమేష్. దూర ప్రయాణం కదా.. భార్య ఒప్పుకుంటుందో లేదోనని తులసిని అడిగాడు. ఆమె కూడా ఓకే చెప్పింది.

ప్రయాణానికి అన్ని ఏర్పాట్లు చేసుకొని,

పిల్లలిద్దర్నీ బంధువుల దగ్గర వదిలిపెట్టి తమ సాహసయాత్ర ప్రారంభించారు. జులై 2న తమ ఎఫ్‌జిఎస్ వి3 ద్విచక్ర వాహనంపై అప్పినపల్లి నుంచి బయలుదేరారు. పలమనేరు, హైదరాబాద్, నాగ్‌పూర్, ఝాన్సీ గ్వాలియర్, ఢిల్లీ, పానిపట్, అంబాలా, పఠన్‌కోట్, జమ్మూ, పత్నిటాప్, సింథన్‌టాప్, అనంత్‌నాగ్, శ్రీనగర్, పాంగోంగ్ సరస్సు, గుల్‌మర్గ్, సోనామార్గ్, డ్రాస్, కార్గిల్, ఫటుల్లాటాప్, లహిర్ గోన్‌పా, మాగ్నిటిక్ హిల్ ఖాదర్ గుడ్లా టాప్, నుబ్రా వ్యాలీ, దిస్కిట్, హున్‌డిర్, కులుమనాలి, మండిడి, గురుద్వార్, ఆగ్రా, తాజ్‌మహాల్, వారణాసి, బర్‌గి డ్యామ్ ప్రదేశాలను సందర్శిస్తూ ప్రయాణం సాగించారు.

ఎన్నెన్నో అందాలు

'లద్దాక్‌లో 'పాంగోంగ్' అనే ఉప్పునీటి సరస్సు ఉంది. దీని అందాలను వీక్షించేందుకు రెండు కళ్లూ సరిపోవు. శీతాకాలంలో పూర్తిగా గడ్డ కట్టి, మంచు దుప్పటిలా మారిపోయే ఈ సరస్సు వేసవి కాలంలో నీలం రంగులో కనులవిందు చేస్తుంది. ఎత్తైన తెల్లటి కొండల మధ్య హోయలు పోతూ రంగులు మారుతూ ఉంటుంది. ఈ సరస్సు సముద్రమట్టం నుంచి 4,225 మీటర్ల ఎత్తులో ఉంటుంది. 'ఖార్‌దుంగ్లా' అనే ప్రాంతం 17,582 అడుగుల ఎత్తులో ఉంటుంది. ప్రపంచంలోనై ఎత్తయిన ప్రాంతాలుగా ప్రసిద్ధికెక్కిన మన దేశంలోని ఈ ప్రదేశాలను చేరుకోవడం ఒక తియ్యని అనుభూతి. అందుకే వీటిని ప్రత్యక్షంగా వీక్షించాలని నిర్ణయించున్నాం" అంటున్నారు రమేష్ దంపతులు.

దారిపొడవునా ఇబ్బందులు

ఈ యాత్రలో రమేష్, తులసీ అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వాతావరణ పరిస్థితులు అనుకూలించకపోవడం వల్ల ఇక్కట్లు పడ్డారు. జమ్మూ బోర్డర్ వరకూ సాఫీగా సాగిన వీరి ప్రయాణంలో ఆ తరువాత నుంచి కష్టాలు మొదలయ్యాయి. విపరీతమైన చలి వాతావరణంలో బైక్‌పై ప్రయాణం, 45 డిగ్రీల కోణంలో ఉండే కొండ మార్గాలు, లోయలు, సముద్రమట్టానికి 982 అడుగుల ఎత్తులో ప్రయాణం.. ఇవన్నీ వారికి సాహస కృత్యాలే. ఇలా వెలుతున్న క్రమంలో 'డ్రాస్' అనే ప్రాంతానికి చేరేసరికి రాత్రయ్యింది. అక్కడ రూములు దొరకలేదు. బయట ఎముకలు కొరికే చలి. దీంతో ఒకచోట టెంట్ వేసుకొని, లోపల చిన్న మంట పెట్టి రాత్రంతా గడిపారు. తెల్లవారిన తరువాత మళ్లీ ప్రయాణాన్ని కొనసాగించారు. ఇలాంటి ఇబ్బందులు ఎదుర్కొంటూనే పట్టువదలకుండా లద్దాక్‌కు చేరుకున్నారు.

'ఇంత పెద్ద జర్నీ మాకు ఎన్నో గొప్ప అనుభూతులను మిగిల్చింది' అంటూ తమ అనుభవాలను బంధువులు, స్నేహితులు, గ్రామస్తులతో సంతోషంగా పంచుకుంటున్నారు. ఈ యాత్రకు దాదాపు రూ.2 లక్షలకు పైగానే ఖర్చు పెట్టారు. ఇప్పటివరకు మన రాష్ట్రం నుంచి 12 మంది బైక్‌పై ఒంటరిగా లద్దాక్‌కు వెళ్లొచ్చారు. అయితే మొదటిసారి జంటగా వెళ్లిన వారు రమేష్ దంపతులే కావడం విశేషం. వీరు తమ యాత్రను ముగించుకొని ఆగస్టు 8న స్వగ్రామం చేరుకున్నారు. బైకుపై సుదూర ప్రయాణం చేసిన జంటగా స్థానిక ఎమ్మెల్యే సన్మానంతో పాటు, పలువురి అభినందనలు పొందారు.

- సిఎస్.ప్రసాద్
చిత్తూరు ప్రతినిధి

బ్రిటన్ వెళ్లిన ప్రభాస్

హీరో ప్రభాస్ ప్రస్తుతం ఊపిరాడని షెడ్యూల్‌తో బిజీగా ఉన్నారు. రాధే శ్యామ్ చిత్రాన్ని సంక్రాంతికి తీసుకురానుండగా, ప్రస్తుతం సలార్, ఆదిపురుష్ చిత్రాలు చేస్తున్నాడు. నాగ్ అశ్విన్‌తో సైన్స్ ఫిక్షన్ మూవీని ప్రారంభించి షెడ్యూళ్లకు సహకరిస్తున్నాడు. అయితే ఆదిపురుష్ సినిమాలో శ్రీరాముడి పాత్రలో ప్రభాస్ కనిపించనున్నాడు. ఈ పాత్ర విషయంలో దర్శకుడు ఓంరౌత్ ఎన్నో జాగ్రత్తలు తీసుకుంటున్నారు. శరీరాకృతిలో లుక్ పరంగా కంటిన్యూటీ మిస్ కాకుండా జాగ్రత్త పడాల్సిందిగా ప్రభాస్‌కి సూచించారు. అయితే ప్రభాస్ బాహుబలి, సాహో వంటి వరుస సినిమాల్లో శరీరంలో కొన్ని మార్పులు చోటుచేసుకున్నాయి. దీనివల్ల ప్రభాస్‌కి ఇబ్బందులు ఎదురవుతున్నాయని, యూకేలోని వరల్డ్ క్లాస్ డాక్టర్ వద్దకు పంపించి చికిత్స చేయించాలని నిర్ణయించారు.

15న 'బ్యాచ్‌లర్' పాట

అఖిల్ అక్కినేని, పూజా హెగ్డే జంటగా వస్తున్న రొమాంటిక్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ చిత్రం మోస్ట్ ఎలిజిబుల్ 'బ్యాచ్‌లర్'. మెగా ప్రొడ్యూసర్ అల్లు అరవింద్ సమర్పణలో బొమ్మరిల్లు భాస్కర్ ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు. ఈచిత్రం నుంచి లెహరాయి లిరికల్ సాంగ్ సెప్టెంబర్ 15న విడుదల కానుందని చిత్రబృందం తెలిపింది. ఈ మేరకు అఖిల్, పూజ హెగ్డే రొమాంటిక్ పోస్టర్ విడుదల చేశారు మేకర్స్.

కాకినాడలో 'పుష్ప'

'పుష్ప' సినిమా షూటింగ్ నిమిత్తం సినీ నటుడు అల్లు అర్జున్ శనివారం కాకినాడ చేరుకున్నారు. సుకుమార్ దర్శకత్వం వహిస్తున్న ఇందులో రష్మిక మందన్న హీరోయిన్‌గా నటిస్తోంది. సినిమా కోసం ఇప్పటికే చాలాసార్లు చిత్రబృందం కాకినాడకి రావడం జరిగింది. మళ్ళీ కొన్ని షెడ్యూల్స్ ఉండడంతో కాకినాడ వచ్చారు. రెండు రోజుల పాటు అల్లు అర్జున్ కాకినాడ పోర్ట్ లోపల జరిగే చిత్రీకరణలో పాల్గొంటారు. మైత్రీమూవీ మేకర్స్, ముత్యంశెట్టి మీడియా కలిసి నిర్మిస్తున్నారు. 5 భాషల్లో తయారవుతున్న 'పుష్ప' పార్ట్ 1 ఈ ఏడాది చివర్లో విడుదల కాబోతోంది.

'ఆర్ఆర్ఆర్' మళ్లీ వాయిదా

సినీ ప్రియులందరూ ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తోన్న 'ఆర్ఆర్ఆర్' సినిమా విడుదల మరోసారి వాయిదా పడింది. సంక్రాంతి కానుకగా ఈ ఏడాది జనవరిలో విడుదల కావాల్సిన 'ఆర్ఆర్ఆర్' కరోనా కారణంగా ఏర్పడిన పరిస్థితుల రీత్యా అక్టోబర్‌కి వాయిదా పడిన విషయం తెలిసిందే. కాగా, మరోసారి వాయిదా పడుతున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. 'అక్టోబర్‌లో 'ఆర్ఆర్ఆర్' విడుదల చేసేందుకు పోస్ట్ ప్రొడెక్షన్ చాలా వరకూ పూర్తయ్యింది. కానీ, అందరూ అనుకున్నట్లే 'ఆర్ఆర్ఆర్' విడుదల వాయిదా వేస్తున్నాం. ప్రపంచవ్యాప్తంగా ఉన్న సినిమా థియేటర్లు ఇంకా పూర్తిగా తెరుచుకోని నేపథ్యంలో కొత్త విడుదల తేదీని ప్రకటించలేకపోతున్నాం. థియేటర్లు పున్నప్రారంభమైన వెంటనే తప్పకుండా సినిమా విడుదల చేస్తాం' అని చిత్రబృందం ట్వీట్టర్ ద్వారా తెలిపింది.

దీపావళికి 'అన్నాత్తె'

తమిళ సూపర్‌స్టార్ రజనీకాంత్ అభిమానులు ఎదురుచూస్తున్న 'అన్నాత్తె' సర్‌ప్రైజ్ చిత్రబృందం విడుదల చేసింది. రజనీకాంత్ ప్రధాన పాత్రలో నటిస్తున్న ఈ సినిమాలో ఆయన ఫస్ట్‌లుక్‌ని వినాయక చవితి పండుగ సందర్భంగా ఈ పోస్టర్‌ని విడుదల చేసింది. ఇందులో రజనీ సంప్రదాయ దుస్తుల్లో స్టైలిష్‌గా కనిపించారు. దీపావళి కానుకగా నవంబర్ 11న ఈ సినిమా విడుదల చేస్తున్నట్లు తెలిపింది. యాక్షన్, ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ కథాంశంతో రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రానికి శివ దర్శకత్వం వహించారు. ఇందులో రజనీకాంత్‌కు పక్కన నయనతార హీరోయిన్‌గా నటించింది. కీర్తి సురేశ్, మీనా, ఖుష్బు సుందర్ కీలకపాత్రలో కనిపించనున్నారు. సన్ పిక్చర్స్ పతాకంపై రూపొందుతున్న ఈ సినిమా చిత్రీకరణ వేగంగా జరుపుకుంటోంది.

ఈ నెలాఖరుకు 'మరో ప్రస్థానం'

నటుడు తనీశ్, ముస్కాన్ సేథీ జంటగా జాని దర్శకత్వంలో నటించిన విభిన్న కథా చిత్రం 'మరో ప్రస్థానం'. యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా సిద్ధమైన ఈ చిత్రాన్ని హిమాలయ స్టూడియో మాన్సన్స్, ఉదయ్‌కిరణ్ సమర్పణలో మిర్త్ మీడియా సంస్థ నిర్మించింది. నిర్మాణాంతర పనులు పూర్తి చేసుకుంటున్న ఈ చిత్రాన్ని సెప్టెంబర్ నెలాఖరు నాటికి ప్రేక్షకుల ముందుకు తీసుకువచ్చేందుకు చిత్రబృందం సన్నాహాలు చేస్తోంది. 'ఓ విభిన్నమైన కథాంశంతో తెరకెక్కిన ఈ సినిమా ఓ ఎమోషనల్ కిల్లర్ జర్నీ. ప్రతి సన్నివేశంలో ప్రేక్షకులు ఉత్కంఠకు లోనవుతారు' అని దర్శక నిర్మాతలు చెబుతున్నారు. నటి భానుశ్రీ మెహ్రా, కబీర్ దుహాన్ సింగ్, రాజా రవీంద్ర కీలక పాత్రల్లో కనిపించనున్నారు.

రికార్డు గ్రాండ్‌స్లామ్‌కు చేరువలో జకో

నేడు యుఎస్ ఓపెన్ ఫైనల్లో మెద్వదెవ్‌తో ఢీ

న్యూయార్క్: యుఎస్ ఓపెన్ పురుషుల సింగిల్స్ ఫైనల్లో టాప్‌సీడ్ నొవాక్ జకోవిచ్, 2వ సీడ్ రష్యాకు చెందిన డానియేల్ మెద్వదెవ్ ప్రవేశించారు. శుక్రవారం రాత్రి జరిగిన తొలి సెమీఫైనల్లో జకోవిచ్ 4-6, 6-2, 6-4, 4-6, 6-2తేడాతో టోక్యో ఒలింపిక్స్ స్వర్ణ పతక విజేత, 4వ సీడ్, జర్మనీకి చెందిన అలెగ్జాండర్ జ్వెరెవ్‌ను ఐదుసెట్ల హోరాహోరీ పోరులో ఓడించాడు. దీంతో జకోవిచ్ క్యాలెండర్ గ్రాండ్‌స్లామ్ టైటిల్‌తోపాటు రికార్డు 21వ గ్రాండ్‌స్లామ్‌పై కన్నేశాడు. గ్రాండ్‌స్లామ్స్ చరిత్రలో అత్యధిక టైటిల్స్(20) ఫెదరర్, నాదల్, జకోవిచ్ పేరిట పదిలంగా ఉంది. జకోవిచ్ గెలిస్తే 21వ గ్రాండ్‌స్లామ్ అతని ఖాతాలో చేరనుంది. దీంతో అత్యధిక గ్రాండ్‌స్లామ్ టైటిళ్లు నెగ్గిన ఆటగానిగా జకోవిచ్ చరిత్ర సృష్టించనున్నాడు. రెండో సెమీస్‌లో డానియేల్ మెద్వదెవ్ 6-4, 7-5, 6-2తేడాతో వరుస సెట్లలో 12వ సీడ్ కెనడాకు చెందిన ఫెలిక్స్ ఆగర్‌ను చిత్తుచేశాడు.

రికార్డు గ్రాండ్‌స్లామ్‌పై జకో గురి..

ఈ ఏడాది జరిగిన మూడు గ్రాండ్‌స్లామ్ టైటిల్స్ నెగ్గిన జకోవిచ్ చివరిదైన యుఎస్ ఓపెన్ కూడా సొంతం చేసుకుంటే క్యాలెండర్ గ్రాండ్‌స్లామ్ సాధించే అరుదైన అవకాశం లభించనుంది. 1969 లో చివరిసారి దిగ్గజ లాడ్ రావర్ ఈ ఘనతను సాధించాడు. మళ్లీ ఇన్నాళ్లకు ఆ రికార్డును చేరుకొనే అవకాశం జకోవిచ్ లభించింది. 2021 ఏడాదిలో జకోవిచ్ ఆస్ట్రేలియా, ఫ్రెంచ్, వింబుల్డన్ గ్రాండ్ స్లామ్ టైటిల్స్ నెగ్గాడు. టైటిల్ పోరు ఆదివారం అర్ధరాత్రి(1.30గం॥లకు) జరగనుంది.

యువ క్రీడాకారిణుల మధ్య మహిళల ఫైనల్స్

మహిళల సింగిల్స్ ఫైనల్ ఇద్దరు అన్‌సీడెడ్ క్రీడాకారిణుల మధ్య జరగనుంది. శుక్రవారం జరిగిన సెమీఫైనల్లో 17ఏళ్ల ఎమ్మా రదుకాను(బ్రిటన్) 6-1, 6-4తేడాతో 17వ సీడ్ సక్కారి(గ్రీక్)ను చిత్తుచేయగా.. 19ఏళ్ల అన్నె ఫెర్నాండెజ్(కెనడా) 7-6(7-3), 4-6, 6-4తో 2వ సీడ్ సబలెంకా(బెలారస్)ను ఓడించడం విశేషం. ఈ మ్యాచ్ శనివారం అర్ధరాత్రి 1.30 గం॥లకు జరగనుంది.

ఐదో టెస్ట్ రద్దుతో యుఏఇకి పయనం

అబుదాబి చేరిన రోహిత్, బుమ్రా, సూర్యకుమార్

ఐపిఎల్‌కు బెయిర్‌స్టో, మలాన్, వుడ్స్ దూరం..

సన్‌రైజర్స్ విధ్వంస ఓపెనర్ బెయిర్‌స్టో, పంజాబ్ కింగ్స్ స్టార్ బ్యాట్స్‌మన్ డేవిడ్ మలాన్, ఢిల్లీ క్యాపిటల్స్ ఆల్‌రౌండర్ క్రిస్ వోక్స్ ఈ సీజన్ ఐపిఎల్‌కు దూరమయ్యారు. వ్యక్తిగత కారణాలతో ఐపిఎల్‌కు దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నట్లు ఆ ఫ్రాంచైజీలకు తెలిపారు. వచ్చే నెలలో టి20 ప్రపంచకప్, అనంతరం యాషెస్ సిరీస్ నేపథ్యంలో కుటుంబ సభ్యులతో కొంతకాలం గడిపేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది.

22న ఇంగ్లండ్‌కు గంగూలీ?

ఐదోటెస్ట్ రీ షెడ్యూల్‌కు ప్రతిపాదన

మాంచెస్టర్: ఐదోటెస్ట్ రద్దుతో బిసిసిఐ అధ్యక్షులు సౌరవ్ గంగూలీ ఇంగ్లండ్‌కు పయనం కానున్నాడు. ఆ టెస్ట్ రీ షెడ్యూల్‌కు ఇంగ్లండ్-వేల్స్ క్రికెట్‌బోర్డుతోపాటు చర్చించనున్నాడు. ఐదోటెస్టు రద్దుతో ఇంగ్లండ్ క్రికెట్ బోర్డుతోపాటు ప్రసార హక్కుదారులకు భారీ నష్టం వాటిల్లే ప్రమాదముందని ఆ లోటును పూడ్చేందుకు సెప్టెంబర్ 22న గంగూలీ ఇంగ్లండ్ వెళ్లి ఐదో టెస్ట్ రీ షెడ్యూల్‌కు ప్రతిపాదించనున్నట్లు తెలిసింది.

ఐదు టి20ల సిరీస్‌ను బంగ్లాదేశ్ జట్టు 3-2తేడాతో కైవసం చేసుకుంది. శుక్రవారం ఢాకా న్యూజిలాండ్‌తో జరిగిన ఐదో, చివరి టి20లో కివీస్ జట్టు 27 పరుగుల తేడాతో బంగ్లా జట్టును చిత్తుచేసింది. ఆఖరి టి20కి ముందే సిరీస్‌ను బంగ్లా గెలుచుకొన్న విషయం తెలిసిందే. మ్యాన్ ఆఫ్ ది సిరీస్ లాథమ్, నాసమ్ అహ్మద్‌లకు దక్కాయి.

ఇ-వేలం - కాంకస్ట్ స్టీల్ & పవర్ లిమిటెడ్ (ఇన్ లిక్విడేషన్)
ఇన్‌సాల్వెన్సీ అండ్ బ్యాంక్రప్టసీ కోడ్, 2016 క్రింద ఆస్తుల విక్రయం

లిక్విడేటర్ ద్వారా ఏర్పాటుకాబడిన లిక్విడేషన్ ఎస్టేట్ ఏర్పాటు భాగంగా కాంకస్ట్ స్టీల్ & పవర్ లిమిటెడ్ (ఇన్ లిక్విడేషన్) ద్వారా సొంతమైన అస్సెట్స్ మరియు ఆస్తుల విక్రయం, హానరబుల్ నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్, కోల్‌కత బెంచ్ వైడ్ ఆర్డర్ 26 సెప్టెంబర్ 2018 తేదిన నియమించబడింది.
ఆసక్తిగల అభ్యర్థులు వివరణాత్మక EOI ప్రాసెస్ డాక్యుమెంట్ మరియు అస్సెట్ విక్రయం ప్రాసెస్ మెమొరిండం కార్పోరేట్ డెబ్టార్ వెబ్‌సైట్ https://concastispat.com/nclt.html మరియు ఇ-వేలం వెబ్‌సైట్ https://ncltauction.auctiontiger.net మీద అప్‌లోడ్ చేయబడింది.
వేలం విక్రయం ఇ-వేలం ప్లాట్‌ఫారం ((ప్రతి 15 నిమిషాలు అపరిమిత పొడగింపు) https://ncltauction.auctiontiger.net ద్వారా జరుగును.

అస్సెట్ లాట్	విక్రయం పద్ధతి	తనిఖీ తేది	వేలం తేది మరియు సమయం	బయానా మొత్తం & దాఖలకు గడువు	ఫ్లోర్ ప్రైస్
అస్సెట్ లాట్ నం.1- బంకుర యూనిట్	స్వతంత్ర పద్ధతి	సెప్టెంబర్ 25, 2021 లోపు	సెప్టెంబర్ 28, 2021 ఉ.11:01 నుండి సెప్టెంబర్ 28, 2021న 18:00 గం.ల వరకు	ఐఎన్‌ఆర్ 10 కోట్లు లేదా సెప్టెంబర్ 24, 2021 లోపు	ఐఎన్‌ఆర్ 90 కోట్లు
అస్సెట్ లాట్ నం.3- శ్రీకాకుళం యూనిట్	స్వతంత్ర పద్ధతి	సెప్టెంబర్ 25, 2021 లోపు	సెప్టెంబర్ 28, 2021 ఉ.11:01 నుండి సెప్టెంబర్ 28, 2021న 18:00 గం.ల వరకు	ఐఎన్‌ఆర్ 5 కోట్లు లేదా సెప్టెంబర్ 24, 2021 లోపు	ఐఎన్‌ఆర్ 49 కోట్లు

ఇ-వేలానికి సంబంధించి ఏదైనా సమాచారం కొరకు, సంప్రదించుటకు: శ్రీ సప్తరిషి బైద్య/శ్రీ నవ్‌నిత్ కుమార్ +91 98360 70992/79035 75095. ఇమెయిల్: LQ.Concast@in.gt.com.
తదుపరి వేలాల కొరకు పబ్లిక్ నోటీసు (వర్తిస్తుంది) http://concastispat.com/nclt.html మరియు ఇ-వేలం వెబ్‌సైట్ https://ncltauction.auctiontiger.net మీద ప్రచురించబడుతుందని దయచేసి గమనించవలెను.

క్షితిజ్ చవచ్చరియా
లిక్విడేటర్ ఆఫ్ కాంకస్ట్ స్టీల్ & పవర్ లిమిటెడ్ (ఇన్ లిక్విడేషన్)
ఐబిబిఐ రిజిస్ట్రేషన్ నం-ఐబిబిఐ/ఐపిఎ-001/ఐపి-పి00358/2017-18/10616
ప్రదేశం: కోల్‌కత నమోదిత చిరునామా: C/O బి. చవచ్చరియా & కో., 8ఎ & బి, సత్యం టవర్ 3, అలిపోర్ రోడ్, కోల్‌కత-700027, ఇమెయిల్: Kshitiz@bccoindia.com
తేది: 11 సెప్టెంబర్, 2021

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Mallajosyula Venkata Subrahmanya Sarma, Ph : 2577248, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68

epaper.prajasakti.com